క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటైన కంచె

సాక్షి ఎఫెక్ట్

దుబ్బాకటౌన్: స్థానిక గాంధీ విగ్రహం సమీపంలోని జోడు స్తంభాల దేవాయం వెనుకనున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అధికారులు కంచె ఏర్పాటు చేశారు. 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో సాక్షి గతంలో కథనాన్ని ప్రచురించింది. దీనికి మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ స్పందించారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయించారు.

352 మందికి దంత పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ములుగు(గజ్వేల్): సిద్దిపేట, గజ్వేల్ ప్రజ్ఞ, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గజ్వేల్ లక్ష్మీ శ్రీనివాస డెంటల్ ఆసుపత్రికి చెందిన వైద్యులు శ్రీనివాస్, రమాదేవి 352మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి టూత్ బ్రష్, పేస్టులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫస్ట్‌వైస్ డిస్ట్రిక్ గవర్నర్ అమర్‌నాథ్‌రావు, ప్రతినిధులు శ్రీధర్, మధు వెంపటి, పద్మావతి, ప్రవీణ్, శ్రీనివాస్, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న మాజీ మంత్రి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లిలో గల ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బుధవారం ఆందోళన చేశారు. ఇప్పటి వరకు పంట రుణాల మాఫీ డబ్బులు ఎందుకు అందలేదని నిలదీశారు. మేనేజర్‌తో మాట్లాడి బ్యాంకును మూసివేయించి నిరసనకు దిగారు. బ్యాంకు అధికారుల తప్పిదం వల్లే సుమారు 800మంది రైతులకు రుణమాఫీ డబ్బులు అందలేదని వెంటనే చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి బ్యాంకు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మంత్రులు చెప్పిన విధంగా ఈ నెలాఖరులోగా రుణమాఫీ చేసి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రికార్డులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల రికార్డులను భద్రపర్చాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా చేసిన పనులపై సోషల్ ఆడిట్ ఉంటుందని, ఆ వివరాలకు చెందిన రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రమేశ్, ఏపీఎం పద్మ, టీఏ పరశురాములు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి సూచించారు. కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు, అర్హత కల్గిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగులనే వాడదాం..

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



హుస్నాబాద్: అవగాహన కల్పిస్తున్న రజిత

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులను వాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం 15వ వార్డులో ఇంటింటికీ తిరిగి చెత్త విభజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఇచ్చిన బ్లూ కలర్ డస్ట్‌బిన్‌లో పొడిచెత్త, గ్రీన్ కలర్ డస్ట్‌బిన్‌లో తడిచెత్త వేసి మున్సిపల్ వాహన కార్మికులకు అందించాలన్నారు. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు పంపిస్తారని, తడిచెత్తతో ఎరువును తయారు చేస్తారని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, కూరగాయల మార్కెట్‌కు వెళ్లేటప్పుడు జ్యూట్ బ్యాగులను తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మన ఇంటితోపాటు మన పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పిలుపునిచ్చారు. మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ, గ్రౌండ్ క్లీనింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఎస్‌డీపీటీ ఎస్‌హెచ్‌ఎస్ ఆకృతిలో కూర్చున్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రభు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, జవాన్లు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులతో సిబ్బంది

భాగస్వాములు కావాలి: జడ్జి సౌమ్య

గజ్వేల్‌రూరల్: స్వచ్ఛతా హీ సేవలో ప్రజలంతా భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ సౌమ్య పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పండరి, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు నర్సింహులు, న్యాయవాదులు, లీగల్ సర్వీస్ సిబ్బంది నరసింహాచారి, యామిని తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: మాట్లాడుతున్న జడ్జి సౌమ్య

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): పరిసరాలను అందరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లద్నూర్ పీహెచ్‌సీ డాక్టర్ స్టువర్ట్‌సన్ పిలుపునిచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛతా హీ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల రక్త నమూనాలను సేకరించారు. ఏఎన్‌ఎంలు మల్లోత్ర, లలిత, ఆశ, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): కార్మికులకు రక్త పరీక్షలు

పోషకాహారంపై అవగాహన అవసరం

సీడీపీఓ సరిత



గజ్వేల్: మాట్లాడుతున్న సరిత

గజ్వేల్: పోషకాహార ప్రాధాన్యతంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని గజ్వేల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సరిత పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీగిరిపల్లిలో బుధవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాహారంపై సరైన అవగాహనలేక ఎంతోమంది అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నెలరోజులపాటు నిర్వహించనున్న ఈ పోషణ మాసోత్సవాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీగిరిపల్లి వైద్యాధికారి బల్వీర్‌సింగ్, సూపర్‌వైజర్ సౌజన్య, పంచాయతీ కార్యదర్శి వేణు, సీహెచ్‌ఓ ఖాసీం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాళ్లు అందరినీ ఆకట్టుకున్నాయి.

పోషకాహారంతోనే ఆరోగ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉండగలమని సీడీపీఓ సరిత అన్నారు. బుధవారం పోషణమాసం ఉత్సవాల్లో భాగంగా జగదేవ్‌పూర్ సెక్టార్ పరిధిలోని పీర్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, ప్రత్యేక అధికారి వసంతరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న జగదీశ్వర్

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉత్తమ సేవలందించిన పోలీసు సిబ్బందికి డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో పదో స్థానంలో నిలిచిన మద్దూరు ఏఎస్‌ఐ జగదీశ్వర్, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించి ఐదో స్థానంలో నిలిచిన త్రీ టౌన్ స్టేషన్ మహిళ కానిస్టేబుల్ కవితను డీజీపీ కార్యాలయంలో సన్మానించినట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సీపీ అనురాధ అభినందించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీజేఆర్, అంబేడ్కర్, విక్టరీ, నర్సాపూర్ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 30మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా వారికి రూ.35వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని శనిగరం పరిధిలోని శంకర్‌నగర్‌లో ఎస్‌ఐ అభిలాష్ పట్టుకున్నారు. సిబ్బందితో కలసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఓ ఇసుకలారీని విచారించామని, ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను హైదరాబాద్‌కు రవాణా చేస్తున్న విషయాన్ని గమనించామని, కేసు నమోదుచేసి లారీని స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటరూరల్: హైవే రోడ్డు పనుల వల్ల ఇర్కోడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇర్కోడ్‌తో పాటు పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని చెప్పారు.

పంటల రక్షణ జాగ్రత్తలను వివరించండి

డివిజన్ వ్యవసాధికారి బాబూనాయక్



పత్తి పంటను పరిశీలిస్తున్న బాబూనాయక్

కొండపాక(గజ్వేల్): వర్షాలకు దెబ్బతింటున్న పంటల రక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించాలని డివిజన్ వ్యవసాయాధికారి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని మర్పడ్గ, కొండపాక గ్రామాల్లోని వరి, పత్తి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు, వరి, పత్తి పంటలకు తెగుళ్లు సోకి దెబ్బతింటున్న విషయాన్ని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వరి పంటలో తెగుళ్లకు కాపర్ క్సీ క్లోరైడ్ 13:0:45 మందులను, పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణ కోసం ఇమిడాక్లోపెడ్, డిపెంతిరోన్ మందులను పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పంటలు చేతికందే వరకు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతలు

జగదేవ్‌పూర్(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్)/గజ్వేల్‌రూరల్/కొండపాక(గజ్వేల్): జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు నూతన ఎంఈఓలను నియమించారు. బుధవారం వారు బాధ్యతలు చేపట్టారు. జగదేవ్‌పూర్ విద్యాధికారిగా ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవరెడ్డి, అక్కన్నపేట ఎంఈఓగా గుగులోతు రంగనాయక్, రంగనాయక్ మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు. అదే విధంగా మద్దూరు మండల విద్యాధికారిగా వరదరాజు, ధూళ్మిట్ట మండల విద్యాధికారిగా మీనాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. గజ్వేల్ ఎంఈఓగా వై.కృష్ణ నియామకమయ్యారు. ఆయన ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా కొండపాక పరిధిలోని కుకునూరుపల్లి ఎంఈఓగా బచ్చలి సత్తయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు.

జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- అర్హులందరికీ ఇళ్ల స్థలాలు
- మంత్రి కొండా సురేఖ



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

దుబ్బాక: జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషిచేస్తుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి దుబ్బాక జర్నలిస్టులు మంత్రి కొండా సురేఖను కలిసి ఇళ్ల స్థలాల కోసం వినతి పత్రం అందించారు. జర్నలిస్టులకు ఇంత వరకు ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదని, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు మంత్రికి విన్నవించారు. దీంతో స్పందించిన ఆమె కలెక్టర్‌కు నివేదించి తప్పకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సురేఖకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



అంజాగౌడ్‌ను సన్మానిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): విధులను సక్రమంగా నిర్వర్తిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల ఎంఈఓగా నూతనంగా బాధ్యతలను చేపట్టిన అంజాగౌడ్‌ను బుధవారం విద్యార్థులతో కలిసి ఆయన శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటు పడినప్పుడే సత్ఫలితాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేందర్, పీడీ వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి: వీఆర్‌ఏలు



దుబ్బాకటౌన్: వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్/కోహెడ(హుస్నాబాద్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 3,797మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏ వారసులకు కారుణ్య నియామకాల చేపట్టాలని వీఆర్‌ఏ కారుణ్య నియామకాల సంఘం రాయపోల్ మండల అధ్యక్షుడు పంగ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 61 యేళ్ల పైబడిన వీఆర్‌ఏలు 265మంది మరణించారని, 25మంది వారసులు కూడా మరణించారన్నారు. 14 నెలలుగా 20,555 మంది వీఆర్‌ఏలు చేయవలసిన విధులు 3,797 మంది మాత్రమే నిర్వహిస్తున్నామని వాపోయారు. రాష్ట్రంలో గల 3,797 మంది 61సంవత్సరాల పైబడిన వీఆర్‌ఏ వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందర్, శంకర్, రవి, బాలయ్య, కనకయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్‌లో వీఆర్‌ఏలు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మణ్, రాజు, రాకేశ్, మల్లేశం, ప్రశాంత్, వెంకటేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కోహెడలో వెంకటస్వామి, సంతోష్, మౌనిక, వెంకటయ్య, రాజయ్య, రమేశ్ తదితరులు తహసీల్దార్ సురేఖకు వినతి పత్రాన్ని అందించారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యం

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ ప్రతినిధి స్రవంతి పేర్కొన్నారు. సిద్దిపేట బాలుర ఉన్నత పాఠశాలలో టెక్ మహీంద్రా ఫౌండేషన్, సహాయక ట్రస్ట్, సైన్స్ అకాడమీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుమన్‌తో కలిసి బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధన సాగితే సులభంగా నేర్చుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ భాస్కర్, రిసోర్స్ పర్సన్స్ రేవతి, అమీర్ పాల్గొన్నారు.

నిరాశ చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులు



కలెక్టరేట్ నుంచి తిరిగి వెళ్తున్న లబ్ధిదారులు

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రద్దుకావడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను బుధవారం కలెక్టరేట్ కార్యాలయానికి రావాల్సిందిగా కోరారు. అయితే వివిధ కారణాల వల్ల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఆ సమాచారాన్ని కలెక్టరేట్ అధికారులు మంగళవారం సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. కాని కొందరు రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు సమాచారం చేరవేయలేదు. దీంతో లబ్ధిదారులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకుని నిరాశతో వెనుదిరిగారు.

సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన

బీజేపీ రాష్ట్ర నాయకుడు

బెజ్జంకి(సిద్దిపేట): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేపయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, అనిల్‌రావు, వరుణ్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కల్లెపెల్లిలో ఇన్‌చార్జి ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దాడి చేసిన వ్యక్తిపై చర్యలేవి?

అక్కన్నపేట(హుస్నాబాద్): తమపై దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నిరసిస్తూ బుధవారం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. మండలంలోని కట్కూర్ పంచాయతీలో పనిచేస్తున్న సదానందం, మద్యల రజినీకాంత్, ఉల్లెంగుల వెంకటయ్యలపై అదే గ్రామానికి చెందిన బొజ్జ బాలయ్య దాడిచేసి గాయపర్చాడు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

◆ 27న లక్ష్మణ్ బాపూజీ జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య సమరయోధుడు లక్ష్మణ్ బాపూజీ జయంతిని విజయవంతం చేయాలని అభివృద్ధి అధికారి జగత్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 27న సూడా పార్క్‌లోని లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ హై–లెవల్ బ్రిడ్జి కోసం సర్వే

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి శివారులోగల పిల్లి వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సర్వే పనులు మొదలయ్యాయి. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ కోహెడ పర్యటనలో భాగంగా గ్రామస్తులు చెక్ డ్యాం, హై లెవల్ బ్రిడ్జి కోసం వినతి పత్రం అందించారు. మంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ డీఈ రుహీనా బుధవారం సందర్శించి కొలతలు తీసుకున్నారు.

◆ నూతన భవనం పరిశీలన

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పీఏసీఎస్ భవనాన్ని చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం నాబార్డ్ నిధులు మంజూరయ్యాయన్నారు. రూ.10లక్షలతో భవనం నిర్మిస్తున్నామని, రైతులకు అన్ని రాకల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ యాదగిరి, డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

◆ ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

గజ్వేల్‌రూరల్/దుబ్బాక: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. మనోహర్‌యాదవ్, ఏగొండ, సందీప్, నర్సింహ, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రాజు పాల్గొన్నారు. అలాగే దుబ్బాకలో రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పూసలపల్లె రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు విడుదల చేయడంతో బుధవారం తోటపల్లి, పూసలపల్లె రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

◆ విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల అందజేత

సిద్దిపేటఅర్బన్: తడకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ చైర్మన్ లగిశెట్టి నరసింహులు విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సతీశ్‌తో కలిసి ఆయన 120 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కనకయ్య, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, క్లబ్ డైరెక్టర్ జోగేందర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ మొదటి శత్రువు హరీశ్‌రావే

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గానికి మొదటి శత్రువు ఎమ్మెల్యే హరీశ్‌రావు అని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్ ఆరోపించారు. చంద్రారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

◆ క్రీడా దుస్తుల అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): కొండాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ అమర్ క్రీడా దుస్తులను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్న లక్ష్యంతో దుస్తులను పంపిణీ చేశామన్నారు. హెచ్‌ఎం స్వప్నారెడ్డి, టీచర్లు లక్ష్మణ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీలు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌కు చెందిన పోచమ్మకు రూ.3లక్షలు; వట్టిపల్లి గ్రామానికి చెందిన అశోక్‌కు రూ.2.50లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్‌లను ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి బుధవారం అందించారు. మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మల్లేశం, రాజేందర్‌రెడ్డి, కరుణకర్ పాల్గొన్నారు.

◆ ఆకట్టుకున్న సాధనసురులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ వద్ద సాధనసురులు మూఢనమ్మకలపై చేసిన కళా ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. మూఢ నమ్మకాలను నమ్మవద్దని, మంత్రాలు, తంత్రాలు లాంటివి ఏమి లేవని ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.